# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జవాను మురళీ నాయక్ భౌతికకాయానికి ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు నివాళులర్పించారు.**
2. **రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.**
3. **రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **రాష్ట్ర హైకోర్టుకు రేపటి నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు.**
5. **ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభమవుతాయి.**

==========================

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్‌కు ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్ నివాళులర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు వెళ్లి మురళీనాయక్ తల్లిదండ్రులను పరామర్శించి.. అనంతరం జవాన్ భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. వారికి రాష్ట్రప్రభుత్వం తరపున 50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాల పొలంతో పాటు 300 గజాల ఇంటి స్థలం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు నిర్ణయించామని ఉపముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

...వాయిస్.. 38 సెకన్లు

--------------------------

రాష్ట్ర హైకోర్టుకు రేపటి నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 16న పూర్తిస్థాయిలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పాటు చేశారు. డివిజన్ బెంచ్ కేసుల విచారణ పూర్తయ్యాక సింగిల్ బెంచ్ విధులనూ న్యాయమూర్తులు నిర్వహిస్తారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ. పార్థసారథి ఉత్తర్వులిచ్చారు.

--------------------------

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

--------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పురపాక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు భగత్ సింగ్ కాలనీలో 12 కోట్ల రూపాయలతో రాష్ట్రంలోనే తొలి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు – ఎంఎస్ఎంఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పట్టణాల్లో స్థలం చాలా తక్కువగా ఉంటోందని, ఈ సమస్యకు పరిష్కారంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలియజేస్తూ...

..వాయిస్.. 33 సెకన్లు

--------------------------

ఈరోజు జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం సాధించిన పురోగతిని, మనదేశ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1999వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 11వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. 1998 మే 11వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని పోఖ్రాన్‌లో భారతదేశం అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ యేడు జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

--------------------------

పోషకాహార లోపంతో సరైన రీతిలో ఎదగని చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం "చిన్నారి ఆరోగ్యం" కార్యక్రమం రూపొందించడం శుభ పరిణామం అని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన "చిన్నారి ఆరోగ్యం" కార్యక్రమ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా "చిన్నారి ఆరోగ్యం"పోస్టర్ ను ఆవిష్కరించారు. అంగన్వాడీ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రంలో అన్ని చోట్లా జరగాలని కోరారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

--------------------------

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి అధిక ప్రాధాన్యతనిచ్చి కాలువల్లో పూడికతీత పనులు, పండించిన ధాన్యాన్ని తరలించుకోవడానికి ఉపయోగపడే గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానా యుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం అడవి పాలెం,

మేడపాడు, నేరేడుమిల్లి గ్రామాల్లో 3 కోట్ల 66 లక్షల 55 వేల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...

..వాయిస్: 30 సెకన్లు

----------------------------

ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదవ రోజు అయిన ఈరోజు స్వామి వారు మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం సింహ వాహనంపై స్వామి వారి ఊరేగింపు జరిగింది. అలాగే ఈరోజు రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి ఊరేగింపు జరగనుంది. కాగా చిన్నతిరుమలేశునికి ఈరోజు జరగనున్న దివ్య కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలు సమర్పించింది.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు...

----------------------------

తిరుపతిలోని పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి టి.వెంకట సునీల్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. మే 15 నుండి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని..ఆన్ లైన్‌లో దరఖాస్తు అందుబాటులో ఉంచినట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది. ttd.admission.tirumala.org వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో టిటిడి కోరింది.

----------------------------

ప్రముఖ తత్వవేత్త, ఆధ్యాత్మికవేత్త జిడ్డు కృష్ణ మూర్తి జయంతి ఈ రోజు. 1895వ సంవత్సరం మే 11 వ తేదీన చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించిన ఆయన ఆధునిక తత్వవేత్తలలో ఒకరిగా ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ప్రపంచ మంతటా పర్యటిస్తూ తాత్విక ..., ఆధ్యాత్మిక ..., మానసిక విప్లవం ...., మనోభావ విచారణ ...., ధ్యానం ..., మానవ సంబంధాలు వంటి అంశాలపై ఆయన చేసిన ప్రసంగాలు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశాయి. 1986వ సంవత్సరం ఫిబ్రవరి 17వ తేదీన జిడ్డు కృష్ణ మూర్తి కన్నుమూశారు.

====================